
సాక్షి అనకాపల్లి

ఆదివారం । 25 । జూన్ । 2023



వామనావతారంలో జగన్నాథుడు

అనకాపల్లిటౌన్: గూడ్స్‌రోడ్డు ఇంద్రద్యుమ్న హాల్లో జగన్నాథస్వామి శనివారం వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



స్కూళ్లలో పెరిగిన విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. 8లో

ఆర్థిక తోడ్పాటు




మృతి చెందిన పోలీసుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందించింది. ఎస్పీ మురళీకృష్ణ చెక్కులు అందజేశారు. 8లో

న్యూస్‌రీల్

దేశాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలి

- ఎంపీ సత్యవతి



మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్: దేశాభివృద్ధిలో యువత భాగస్వాములు కావాలని ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి అన్నారు. గవరపాలెం గౌరీగ్రంథాలయంలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ, నెహ్రూయువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన 'యువ ఉత్సవ్-2023' కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. యువశక్తి పెంపుదలలో భాగంగా యువ ఉత్సవ్ 2023 పేరున పలు పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అంతకుముందు విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆమె తిలకించారు. అనంతరం ఈ పోటీల్లో గెలిపొందిన క్రీడాకారులకు ఆమె బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నెహ్రూయువ కేంద్రం జిల్లా అధికారి జి.మహేశ్వరరావు, సెట్విన్ మేనేజర్ కె.వి.ఎస్.ఎన్.మూర్తి, జిల్లా క్రీడాప్రాధికారిక సంస్థ చీఫ్‌కోచ్ కె.అనంతలక్ష్మి, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ రాష్ట్ర సలహా కమిటీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ, మంత్రిత్వశాఖ ఫీల్డ్ పబ్లిసిటీ అసిస్టెంట్ ఐ.షరీఫ్, వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్‌సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, గౌరీగ్రంథాయం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

30న టేబుల్ టెన్నిస్ జిల్లా టీమ్ ఎంపిక

అనకాపల్లిటౌన్: రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీలు(2023-24) వచ్చేనెల 7,8,9 తేదీల్లో రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్నట్టు జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ చైర్మన్ కాండ్రేగులు విష్ణుమూర్తి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడకారులు ఈనెల 29వ తేదీలోపు ఆన్‌లైన్‌ల్లో పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. 30న జిల్లాటీమ్ ఎంపిక జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9494908977 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

27న పీఎఫ్ అదాలత్

అనకాపల్లిటౌన్: స్థానిక గాంధీనగరం ఈఎస్‌ఐ కార్యాలయంలో ఈనెల 27వ తేదీ ఉదయం 9 నుంచి 1గంట వరకూ పీఎఫ్ అదాలత్ నిర్వహించనున్నట్టు విశాఖ రీజనల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నోడల్ అధికారి కె.వి.కృష్ణమోహన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్, ఇతర సంస్థల్లో విధులు నిర్వహిస్తూ, పీఎఫ్ సభ్యత్వం కలిగిన కార్మికుల సమస్యల పరిష్కారానికి అదాలత్ నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. కార్మికులు తమ సమస్యలపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు.

మంచాల.. మెచ్చేలా..!

'ఆహ్లాదకరమైన వాతావరణం.. పాఠశాల చుట్టూ పచ్చదనం.. ప్లాస్టిక్ నిషేధం.. సోలార్ వినియోగంతో మంచాల 'మోడల్' స్కూల్ ఆదర్శంగా నిలిచింది. పర్యావరణాన్ని పరిరక్షిస్తూ...అక్కడ పనిచేసే టీచర్లు, విద్యార్థులు అంతర్జాతీయ ఖ్యాతి పొందేలా తమ స్కూల్‌ను మోడల్‌గా తీర్చిదిద్దారు. దీంతో అంతర్జాతీయ గ్రీన్ మెంటర్స్ ఎన్జీవో అందిస్తున్న ప్రతిష్టాత్మక గ్రీన్ స్కూల్ అవార్డుకు ఎంపికైంది.'

- మంచాల మోడల్ స్కూల్‌కు గ్రీన్ స్కూల్ అవార్డు
- అంతర్జాతీయ గ్రీన్ మెంటార్స్ ఎన్జీవో అందిస్తున్న ప్రతిష్టాత్మక పురస్కారం
- సెప్టెంబర్‌లో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో ప్రదానం

సాక్షి, అనకాపల్లి: పర్యావరణ పరిరక్షణలో భాగంగా చీడికాడ మండలం మంచాల ఏపీ మోడల్ స్కూల్‌కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ప్రతిష్టాత్మక 'గ్రీన్ స్కూల్ అవార్డు- 2023'కు ఎంపికైంది. ఈ ఏడాది సెప్టెంబర్ 15 నుంచి 24 వరకూ న్యూయార్క్‌లో జరిగే 78వ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో ఈ అంతర్జాతీయ గ్రీన్ స్కూల్ అవార్డులు అందజేయనున్నారు. ఈ అవార్డు అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించిన విద్యాసంస్థలకే అందిస్తారు. ప్రతి ఏడాది అంతర్జాతీయ స్థాయిలో 'జ్యూరీ ఆఫ్ గ్రీన్ స్కూల్ అవార్డులకు ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. పాఠశాలలో స్థిరమైన అభ్యాసాలకు సంబంధించిన సమగ్ర విధానాన్ని గుర్తించడం, గ్రీన్ మెంటర్స్ తరఫున పర్యావరణ సుస్థిరతను ప్రోత్సహించడం, విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ పెంపొందించడంలో విశేషమైన కృషి చేసిన పాఠశాలలను ఈ అవార్డుకు ఎంపిక చేస్తారు.

మంచాల మోడల్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు చేసిన కృషి ఫలించింది. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. దీంతో సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్మెంట్(సీఎస్‌ఈ) ద్వారా గ్రీన్ స్కూల్ అవార్డుకు ఎంపికైంది.



చీడికాడ మండలం మంచాల ఏపీ మోడల్ స్కూల్



పర్యావరణ సంరక్షణలో భాగంగా మొక్కలు నాటుతున్న విద్యార్థినులు

ఔషధ, సుగంధ మొక్కలతో గ్రీన్ హౌస్

మంచాల ఏపీ మోడల్ స్కూల్లో ప్రతి రోజూ పాఠశాల ప్రారంభ సమయం నుంచి ముగిసే సమయం వరకూ పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు అడుగడుగునా కృషి చేస్తుంటారు. ఇప్పటికే స్కూల్ క్యాంపస్ ఆవరణలో 1500 వరకు మొక్కలు నాటారు. వీటిలో అనేక ఔషధ సుగంధ మొక్కలతో కూడిన గ్రీన్ హౌస్ ఏర్పాటు చేశారు. స్కూల్లో పూర్తిగా ప్లాస్టిక్‌ను నిషేధించారు. విద్యార్థులు పాలిథిన్ బ్యాగ్‌లు, ప్లాస్టిక్ బాటిళ్లను పూర్తిగా నిషేధించారు.

సేంద్రియ ఎరువుల తయారీ..

డస్ట్ బిన్లను ఉపయోగించి వ్యర్థాలను బయోడిగ్రేడబుల్, నాన్-బయోడిగ్రేడబుల్‌గా విభజించారు. వాటి నుంచి వచ్చిన వ్యర్థాలతో బయో సేంద్రియ ఎరువులను తయారు చేస్తున్నారు. వాటిని అక్కడ మొక్కలకే వేస్తున్నారు. అంతేకాకుండా మెస్, వంట గదిలో వ్యర్థ పదార్థాలను సేంద్రియ ఎరువు తయారీకి ఉపయోగిస్తున్నారు. కాగితం, ప్లాస్టిక్ ఈ-వ్యర్థాలు రీసైక్లింగ్.. పునర్వినియోగం కోసం అధీకృత డీలర్లకు ఇస్తున్నారు. అంతేకాకుండా ఆ గ్రామంలో, చుట్టుపక్కల గ్రామాల్లో విద్యార్థులు పర్యావరణ అవగాహన కార్యక్రమాలు, ప్రచారాన్ని తరచూ నిర్వహిస్తున్నారు

పాత వస్తువులతో అలంకరణ

విద్యార్థుల పాతపుస్తకాలు, మిగిలిపోయిన నోట్ పుస్తకాలను పేద పిల్లలకు పంపిణీ చేస్తారు. పాత సీసాలు, పాత వస్తువులు, వస్త్రం మొదలైన వ్యర్థ పదార్థాలను ఉపయోగించి అలంకరణ, ఇతర ఉపయోగకరమైన వస్తువులను తయారు చేస్తున్నారు. పాఠశాలలోపల.. వెలుపల తోటపని కోసం ఉపయోగించే వర్షపు నీటిని సంరక్షించే సౌకర్యం పాఠశాలలో ఉంది.

గంట పాటు విద్యుత్ నిలుపుదల..

ప్రతి శనివారం గంట పాటు స్కూల్లో, హాస్టళ్లలో విద్యుత్‌ను నిలిపివేయడం ద్వారా శక్తి వినియోగాన్ని తగ్గించడం, సోలార్ వాటర్ హీటర్ సిస్టమ్, సోలార్ లైట్లను వినియోగిస్తున్నారు.

టీం వర్కుతోనే అవార్డు సాధ్యమైంది..



ఆరు నుంచి ఇంటర్ వరకూ తరగతులు నిర్వహిస్తున్నాం. ఇక్కడ బోధించే టీచర్లు, విద్యార్థులు టీంవర్కుతో పనిచేయడం ద్వారానే గ్రీన్ స్కూల్ అవార్డు సాధ్యమైంది. విద్యార్థుల పుట్టిన రోజున కూడా కేక్ కటింగ్‌తో పాటు స్కూల్ ఆవరణలో ఒక మొక్క నాటడమనేది ఇక్కడ ఆచరణగా పెట్టాం. అంతేకాకుండా ప్రతీ విద్యార్థి స్టీల్, సిల్వర్ బాటిల్‌తో వాటర్ తీసుకువస్తారు. వీలైనంత మేరకు టీచర్లు కూడా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టును ఉపయోగించి స్కూల్‌కి వచ్చేలా కూడా ఆంక్షలు పెట్టాం. అటవీ శాఖ సంయుక్త సహకారంతో ఔషధ మొక్కలను పెంచుతున్నాం. ఇతర స్కూళ్లకు కూడా ఆదర్శంగా నిలిచేలా ఏర్పాటుచేశాం.

– సి.హెచ్. వెంకటలక్ష్మి, ప్రిన్సిపాల్, ఏపీ మోడల్ స్కూల్, మంచాల

సకాలంలో రైతులకు విత్తనాలు

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్: రైతులకు అన్ని రకాల విత్తనాలను సకాలంలో పంపిణీ చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. ముకుందపురం ఆర్బీకే వద్ద రాయితీపై వరి విత్తనాల పంపిణీని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతులకు కావాల్సిన వరి విత్తనాలను అందిస్తున్నట్టు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో విత్తనాల కోసం అన్నదాతలు మండల కేంద్రాలకు వెళ్లవలసి వచ్చేదని తెలిపారు. మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు మాట్లాడుతూ మండలంలో 22 రైతు భరోసా కేంద్రాల్లో ఏడురకాల వరి విత్తనాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నట్టు చెప్పారు. 1,322 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, కొత్తపల్లి శ్రీనివాస్, సర్పంచ్ కర్రి గణేష్, ఎంపీటీసీ సభ్యురాలు దండి నాగరత్నం, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జ్ కోరుకొండ చెల్లంనాయుడు, వంటర్లపాలెం సర్పంచ్ అల్లాడ నాగేశ్వరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ శానాపతి కొండలరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు సయ్యపురెడ్డి నారాయణరావు పాల్గొన్నారు.

మునగపాక హౌసింగ్‌లో ప్రక్షాళన

- సిమెంట్, స్టీల్ దుర్వినియోగంపై మరో నలుగురిపై వేటుకు రంగం సిద్ధం
- జేసీకి ఇన్‌చార్జి హౌసింగ్ పీడీ రమామణి నివేదిక

సాక్షి, అనకాపల్లి: మునగపాక హౌసింగ్ కార్పొరేషన్‌లో ప్రక్షాళన జరుగుతోంది. గొడౌన్‌లో ఉన్న సిమెంట్, స్టీల్ దుర్వినియోగానికి పాల్పడిన మరో నలుగురిపై వేటు పడనుంది. దీనిపై సమగ్ర నివేదికను శనివారం జాయింట్ కలెక్టర్ జాహ్నవికి ఇన్‌చార్జి పీడీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కొయ్యా రమామణి అందజేశారు. ఈ నివేదికలో గొడౌన్ ఇన్‌చార్జ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ అవినాష్, డేటా ఎంట్రీ ఆపరేటర్ అర్జున్‌ల ప్రమేయంతో సిమెంట్, ఇనుము మెటీరియల్స్ దుర్వినియోగం జరిగినట్టు విచారణ కమిటీ నిర్ధారించింది. వీరితో పాటుగా మునగపాక మండలం హౌసింగ్ ఏఈ వి. కనకేశ్వరరావు, డిప్యూటీ ఈఈ వి.విజయలక్ష్మిలను బాధ్యులుగా ఆ నివేదికలో పేర్కొన్నారు. అంతేకాకుండా గొడౌన్ పర్యవేక్షణలో జాప్యం చేసినందుకు గతంలో మండల ఇన్‌చార్జిలుగా పనిచేసిన అనిల్ కుమార్, భవ్యతేజ, ప్రస్తుత డిప్యూటీ ఈఈ శ్రీనివాసరావు, అనకాపల్లి ఈఈ ఇ.వి.ఎస్ శ్రీనివాసరావులపై చర్యలు తీసుకోవాలని జేసీ జాహ్నవికి హౌసింగ్ ఇన్‌చార్జి పీడీ రమామణి నివేదిక సమర్పించారు.

రెండో విచారణ... : గత నెల 23న విశాఖపట్నం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో యలమంచిలి నియోజకవర్గం మునగపాక హౌసింగ్ కార్పొరేషన్‌లో సిమెంట్, స్టీలు దుర్వినియోగంపై జెడ్పీటీసీలు ప్రశ్నించిన విషయం విదితమే. ఈ మేరకు అప్పటికప్పుడు నలుగురు సభ్యులతో విచారణ కమిటీ ఏర్పాటుచేశారు. ఈ కమిటీ విచారణలో యలమంచిలి నియోజకవర్గం మునగపాక హౌసింగ్ కార్పొరేషన్‌లో సిమెంట్, స్టీలు గొడౌన్‌లో 1,283 సిమెంట్ బస్తాలు, 40,143 కేజీలు ఇనుము దుర్వినియోగమైనట్టు తేలింది. దీనిపై అప్పటి హౌసింగ్ పీడీ జేసీకి నివేదిక అందిచారు. అవకతవకలకు పాల్పడిన వారిలో కొందరికీ షోకాజ్ నోటీసులు జారీచేశారు. దీనిపై రెండో సారి విచారణలో సమగ్ర నివేదిక ఇవ్వాలని ఇన్‌చార్జి హౌసింగ్ పీడీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కొయ్యా రమామణిని జిల్లా కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి ఆదేశించారు.

అది దొంగ యాత్ర



- సర్కస్ యాత్రగా మారింది
- గ్రామాల్లో తిరుగుతున్న మరో పులిహోరా బ్యాచ్
- ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

అనకాపల్లిటౌన్: అర్హతే కొలమానంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అందజేస్తున్నారని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. కొత్తూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ బస్సు యాత్ర దొంగ యాత్ర అని, సర్కస్ యాత్రగా మారిందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు బాగా లేవని టీడీపీ నేతల్లో ఒక్కరైనా చెప్పగలరా అని ప్రశ్నించారు. ప్రజలెవ్వరూ చంద్రబాబు మాటల్ని విశ్వసించే పరిస్థితి లేదన్నారు. మరో పులిహోర బ్యాచ్ గ్రామాలు తిరుగుతూ ప్రజలను తప్పుదోవ పటిస్తోందన్నారు.రాజకీయాలకు అతీతంగా జగనన్న సురక్ష పథకాన్ని ఇంటింటికీ తీసుకెళతామన్నారు. వారం రోజుల పాటు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, గృహసారథులు, కన్వీనర్లు, అన్ని ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ప్రజల సమస్యలను గుర్తిస్తామన్నారు. జూలై 1 నుంచి 30వ తేదీ వరకూ ఈ కార్యక్రమలో ప్రజల సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. ప్రతి మండలం ఒక ఎంఎల్‌వో పర్యవేక్షణలో ఉంటుందన్నారు. రోజుకు మండల స్థాయిలో 8 బృందాలు సమస్యలపై దృష్టి సారిస్తాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 31 నాటికి పథకాలు అందని వారికి అందజేయాలని ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని ఆయన పేర్కొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- జగనన్న సురక్షతో మిగిలి పోయిన వారికి లబ్ధి
- కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి




ఎంపీడీవో రమేష్ నాయుడుకు సూచనలిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి

సబ్బవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన జగనన్న సురక్ష పథకం ద్వారా వివిధ కారణాల వల్ల సంక్షేమ పథకాలు అందని వారికి ఇప్పుడు అందించేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు కలెక్టర్ రవి పట్టాన్ శెట్టి తెలిపారు.జగనన్న సురక్ష ప్రారంభం సందర్భంగా మండలంలోని తవ్వ వానిపాలెంలో గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో శనివారం ఆయన సమీక్షించారు. తొలి రోజు గ్రామంలో 84 దరఖాస్తులు వచ్చాయని వలంటీర్లు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం నెలరోజుల పాటు నిర్వహించడానికి వీలుగా ఎంపీడీవో, తహసీల్దార్ పర్యవేక్షణలో రెండు టీములు ఏర్పాటు చేశామన్నారు. ఈ రెండు టీంలోని అధికారులువలంటీర్లు సేకరించిన సమాచారం ప్రకారం ప్రభుత్వ పథకాలకు, సంక్షేమ కార్యక్రమాలకు అర్హత ప్రామాణికంగా ఎంపిక చేస్తారని తెలిపారు.ఏ కారణం చేత గతంలో ఎంపిక కాలేదో పునఃసమీక్షిస్తారని చెప్పారు. ఆయా గ్రామాల వారీగా నిర్ణయించిన తేదీలకు వారం రోజులు ముందుగా జగనన్న సురక్ష యాప్ ఓపెన్ అవుతుందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులను ఆన్‌లైన్ లిస్టులో పేర్కొన్న వెంటనే వారికి ఆయా పథకాలు మంజూరు అవుతాయని వివరించారు.

నేరాల నియంత్రణపై దృష్టి

ఎస్పీ మురళీకృష్ణ



మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

యలమంచిలి: నేరాల నియంత్రణపై ప్రత్యేక నిఘా పెడుతున్నట్టు అనకాపల్లి ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. శనివారం ఆయన యలమంచిలి పట్టణ పోలీస్‌స్టేషన్‌ను పరవాడ డీఎస్పీ కె.వి. సత్యనారాయణతో కలసి తనిఖీ చేశారు పెండింగ్ కేసులకు సంబంధించి దర్యాప్తు పురోగతి వివరాలను సీఐ షేక్ గఫూర్, పట్టణ ఎస్‌ఐ పాపినాయుడులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నేరాల నియంత్రణపై ప్రత్యేకంగా దృష్టి సారించేలా సిబ్బందికి ఆదేశాలిచ్చామన్నారు. గంజాయి తరలించేవారిపై పీడీయాక్ట్ నమోదు చేస్తున్నట్టు చెప్పారు. ఈనెల 26న అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో కళాశాలలు,పాఠశాలల్లో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. యలమంచిలి నేషనల్ హైవేపై ప్రమాదాల నివారణకు క్యాట్ ఐ, స్టాపర్లను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. హైవేపై సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నేరాలు అదుపుచేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సచివాలయ మహిళా పోలీసులు తమ పరిధిలో సమస్యలపై ఎప్పటికప్పుడూ స్పందించి, పరిష్కారానికి కృషి చేయాలన్నారు. యలమంచిలి పట్టణంలో చోరీలు నియంత్రణకు తరచూ పోలీస్ బీట్‌ను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. యలమంచిలి రూరల్ ఎస్‌ఐ కె.సన్నిబాబు,పట్టణ ట్రాఫిక్ ఎస్‌ఐ డి.ఈశ్వరావు,అడిషనల్ ఎస్‌ఐ కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన లారీ క్లీనర్ మృతి

అనకాపల్లిటౌన్ : జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన లారీ క్లీనర్ అహ్మద్ ఎన్టీఆర్ వైద్యాలయంలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలివి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన లారీ బెంగుళూరు నుంచి రాంచీ అనకాపల్లి జాతీయ రహదారి మీదుగా వెళ్తుండగా డైట్ కళాశాల సమీపంలో శనివారం తెల్లవారుజామున ముందు వెళుతున్న కంటైనర్‌ను ఢీకొట్టింది. దీంతో వెనక లారీలోని క్లీనర్ అహ్మద్‌కు తీవ్ర గాయాలైనట్టు ఎస్ఐ చెప్పారు. అతనిని ఎన్టీఆర్ వైద్యాలయంలో చేర్చగా చికిత్స పొందుతూ అహ్మద్ మృతి చెందాడు. ఈ మేరకు లారీ డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

దిమిలి ఎస్‌బీఐ మెస్సెంజర్ అక్రమాలు

- మేనేజర్‌కు బాధితుల ఫిర్యాదు

రాంబిల్లి : దిమిలి స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) శాఖలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న రాంప్రసాద్ అక్రమాలకు పాల్పడినట్టు శనివారం మేనేజర్ రవికిరణ్‌కు ఫిర్యాదు చేశారు. రజాల గ్రామానికి చెందిన కర్రి వరహాలమ్మ రూ.2.30 లక్షలు, దిమిలి గ్రామానికి చెందిన బగిరెడ్డి దేవి రూ.30 వేలు రాంప్రసాద్ ద్వారా మోసపోయినట్టు ఫిర్యాదు చేశారు. బ్యాంకులో జమ చేస్తానని నగదును తీసుకొని ఓచర్‌పై సంతకం పెట్టి బ్యాంకు స్టాంపు ఇవ్వడంతో తమకు అనుమానం రాలేదని బాధితులు చెబుతున్నారు. అయితే కొన్ని రోజులుగా మెస్సెంజర్‌గా పనిచేస్తున్న రాంప్రసాద్ విధులకు గైర్హాజరు కావడంతో అనుమానాలు తలెత్తినట్టు తెలిపారు. అంతేగాక తాము అప్పుగా లక్షల రూపాయలు ఇచ్చామని బాధితులు శనివారం బ్యాంకు వద్దకు చేరుకున్నారు. బ్యాంకులో బంగారు ఆభరణాలు తనఖా పెట్టిన ఖాతాదారులు మరింత ఆందోళన చెందుతున్నారు. అయితే రాంప్రసాద్ కొద్ది రోజులుగా విధులకు గైర్హాజరు కావడం వాస్తవమేనని, అతనిపై ఇద్దరు ఖాతాదారులు రూ.2.80 లక్షలు మోసపోయినట్టు తనకు ఫిర్యాదు ఇచ్చారన్నారు. అయితే బ్యాంకు బయట ఇవన్నీ జరిగాయని, తమ బ్యాంకుకు ఎటువంటి సంబంధం లేదన్నారు. దీనిపై ఎస్ఐ దీనబంధును వివరణ కోరగా దిమిలి ఎస్‌బీఐలో చోరీపై తమకు సమాచారం అందిందన్నారు. దీనిపై బ్యాంకు అధికారులను సంప్రదించగా, ఎటువంటి ఫిర్యాదు రాతపూర్వకంగా ఇవ్వలేదన్నారు.

ముస్లింల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

హర్ దిల్ మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్ కే సాథ్ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



24సివిఎం03- ముస్లిం సంఘ ప్రతినిధులను సత్కరిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: ముస్లింలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. హర్ దిల్ మే వైఎస్సార్ హమ్ సబ్ జగన్ కే సాథ్ అనే కార్యక్రమంలో భాగంగా చోడవరం దర్గా వద్ద ముస్లింలను ఆయన శనివారం ఘనంగా సత్కరించారు. తొలుత స్థానిక ముస్లింలంతా ధర్మశ్రీకి ఘన స్వాగతం పలికారు. గతంలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు రిజర్వేషన్‌పాటు అనేక సమస్యలు పరిష్కరించారన్నారు. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు అనేక పథకాలు ప్రవేశపెట్టడంతోపాటు వారిని అన్ని విధాలుగా ఆదుకుంటున్నారని ప్రశంసించారు. ఈ సందర్భంగా తామంతా వైఎస్సార్‌సీపీతోనే ఉన్నామని ముస్లింలు నినాదాలు చేశారు. చోడవరంలో షాదిఖానా, ఈద్గా మసీదు నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనికి ధర్మశ్రీ సానుకూలంగా స్పందించి, వాటి నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ షేక్ జిలానీ, షేక్ బాషా, ఎస్.కె వహాబ్, వక్ఫ్ బోర్డు మైనార్టీ బోర్డు ప్రతినిధి బర్కత్‌అలి, ఎస్‌కే రహిమ్‌తుల్లా, ఎస్‌కే అలిషా, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి సత్య, జిల్లా ప్రతినిధులు ఉప్పలబాబు పాల్గొన్నారు.

బాధిత పోలీసు కుటుంబాలకు ఆర్థిక తోడ్పాటు

చెక్కులు అందజేసిన ఎస్పీ మురళీకృష్ణ



ధనలక్ష్మికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్: విధి నిర్వహణలో మృతి చెందిన పోలీస్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటునందిస్తుందని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో బాధిత పోలీస్ కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.75 వేలు చొప్పున శనివారం ఆయన చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గొలుగొండ పోలీస్ స్టేషన్‌లో హెచ్‌సీగా విధులు నిర్వహిస్తూ విశాఖ జిల్లా ఆనందపురం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జి.దేముడుబాబు భార్య దేవికి, స్పెషల్ బ్రాంచ్, దేవరాపల్లి పోలీస్ స్టేషన్‌లో హెచ్‌సీ, కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ అనారోగ్య కారణాలతో మృతి చెందిన జి.అప్పన్న భార్య ధనలక్ష్మికి, కె.అప్పారావు కుమార్తె మోక్షితకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయమందించామన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ(పరిపాలన) బి.విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి పోలీసుల బాసట

కె.కోటపాడు: అనకాపల్లి వద్ద ఈ నెల 12న రోడ్డు ప్రమాదంలో మరణించిన హోంగార్డు సబ్బవరపు కుమారస్వామి కుటుంబానికి పోలీసులు బాసటగా నిలిచారు. శనివారం చంద్రయ్యపేటలో కుమారస్వామి సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అతడికి చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. రాష్ట్ర పోలీస్ సిబ్బంది సమకూర్చిన రూ.53,500 మృతుడు భార్య హైమకు అందించారు. జిల్లా పోలీస్ సిబ్బంది ఎస్.మారినాయుడు, ఆర్.వెంకటరావు, ఎన్.వెంకటేష్, ఎస్.సన్నిబాబు, బి.వెంకటరావు పాల్గొన్నారు.

జర్మనీలో స్టాఫ్‌నర్సుగా ఉద్యోగావకాశాలు

తుమ్మపాల: బీఎస్సీ నర్సింగ్ అభ్యర్థులకు జర్మనీలో స్టాఫ్ నర్సుగా ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు నైపుణాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి టి.చాముండేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ, ఏపీఎన్ఆర్‌టీఎస్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆసక్తి గల అభ్యర్థులకు జర్మనీ భాషపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి కనీసం రెండేళ్లు ఏదైనా ఆస్పత్రిలో పని చేసిన అనుభవంతో పాటు 20 నుంచి 35 ఏళ్ల మధ్య వారు అర్హులన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు విజయవాడలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో రెన్నెల్లపాటు బీ1 స్థాయి జర్మన్ భాషా ఉచిత శిక్షణకు హాజరు కావాలన్నారు. ఉచిత విమాన చార్జిలతో పాటు జర్మనీలో మొదటి ఆర్నెల్లలో నెలకు రూ.89 వేలు జీతం, ఆహారం, వసతి కల్పించనున్నట్లు తెలిపారు. తర్వాత ఆర్నెల్ల పాటు బీ2 సర్టిఫికెటు కోసం జర్మనీలోనే శిక్షణ ఇస్తారన్నారు. బీ2 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించినప్పుడు జీతం నెలకు రూ.2 లక్షలు వరకు పెరుగుతుందన్నారు. ఈ నెల 30వ తేదీ లోపున ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్/హోమ్/ఆన్‌లైన్ ప్రోగ్రామ్ లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. వచ్చే నెల 1 నుంచి శిక్షణ తరగతులు విజయవాడలో జరుగుతాయన్నారు. హాస్టల్ వసతి కావాల్సిన వారు తప్పనిసరిగా ఫీజు చెల్లించాలన్నారు. మరింత సమాచారం కోసం 9908629287 సంప్రదించాలన్నారు.

నేడు జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీలు

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేట దావిన్సీ పాఠశాలలో ఆదివారం జిల్లాస్థాయి స్విమ్మింగ్ పోటీలు నిర్వహించనున్నట్టు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కర్రి సుందరయ్య, సీహెచ్ దేముడు ఓ ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 10 నుంచి 11 సంవత్సరాలు, 12 నుంచి 14 సంవత్సరాలు, 15 నుంచి 17 సంవత్సరాల మధ్య వయసు ఉన్న బాలబాలికలకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కేటగిరీల వారీగా పోటీలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 95736 90954 అనే ఫోన్‌నంబరులో సంప్రదించాలని వారు కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లి టౌన్: జిల్లాలో అదనపు పథక సమన్వయకర్త, సమగ్ర శిక్ష కార్యాలయాల్లోని బాలికల చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి, అకడమిక్ మోనిటరీ అధికారి, అసిస్టెంట్ స్టాస్టిక్ అధికారి పోస్టుల్లో డిప్యుటేషన్‌పై ఫారిన్ సర్వీస్ కార్యాలయాల్లో విధులు నిర్వహించేందుకు 50 ఏళ్లు దాటని సర్వీస్ ఉన్న ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు డీఈవో కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలన్నారు. మర్ని వివరాలకు కార్యాలయంలో నోటీస్ బోర్డును పరిశీలించాలని సూచించారు.

టీడీపీ, జనసేన పార్టీల నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



డిప్యూటీ సీఎం సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలు

మాడుగుల రూరల్: మండలంలోని పోతనపూడి పంచాయతీ పరిధిలోని 15 కుటుంబాలకు చెందిన టీడీపీ, జనసేన పార్టీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. శనివారం ముకుందపురంలో వీరికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయాలని వారికి సూచించారు. జనసేన పార్టీకి చెందిన మైచర్ల అప్పలనాయుడు, గండెం చిన్నతోపాటు టీడీపీకి చెందిన వడ్డి రాము, చప్పగడ్డి త్రిమూర్తులు, బంటు చంద్రరరావు, మెలిపాక రాము, మెలిపాక శ్రీను, మెలిపాక గణేశ్, మెలిపాక నారాయణరావు, మట్టా అప్పారావు, యలమంచిలి గోపాలకృష్ణ, ఉట రాజు, గుమ్మాల గణేశ్, ఇల్లగంతుల పరిదేశి, ఉట చిరంజీవి, తదితరులు పార్టీలో చేరారు. వీరవల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు కోరుకొండ చెల్లంనాయుడు, వైస్ ఎంపీపీలు తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, కొత్తపల్లి శ్రీనివాస్, ఎం. కోడూరు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, వీరవల్లి మాజీ సర్పంచ్ సయ్యపురెడ్డి నారాయణరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో పెరిగిన విద్యార్థుల సంఖ్య

డీఈవో వెంకటలక్ష్మమ్మ

నర్సీపట్నం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు. నర్సీపట్నం మండలం గబ్బాడ జెడ్పీ, మండల పరిషత్ పాఠశాలలు, నర్సీపట్నంలోని ప్రభుత్వ హైస్కూల్, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నాడు–నేడు పనులను శనివారం ఆమె పరిశీలించారు. విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా నాడు–నేడులో ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించినట్టు చెప్పారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు రావడంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి వచ్చిన 25 మంది విద్యార్థులు గబ్బాడ హైస్కూల్‌లో చేరినట్టు చెప్పారు. ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లిన విద్యార్థులు తిరిగి ప్రభుత్వ పాఠశాలలకు వస్తున్నారని తెలిపారు. విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలను అందజేశామన్నారు. జిల్లాలో 11 మండలాల విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ వచ్చాయని, మిగిలిన వారికి రెండు, మూడు రోజుల్లో వచ్చే అవకాశం ఉందన్నారు. నాడు–నేడు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని హెచ్‌ఎంలకు సూచించినట్టు తెలిపారు. డీఈవో వెంట ఎంఈవో జి.నాగేంద్ర ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో తేడా వచ్చినా... తట్టుకోలేం



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు కళావెంకటరావు

నర్సీపట్నం/మాకవరపాలెం: వచ్చే ఎన్నికల్లో ఏమాత్రం తేడా జరిగిన పులి పంజాను ఏమాత్రం తట్టుకోలేమని సీఎం వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డిని ఉద్దేశించి టీడీపీ మాజీ మంత్రి కళావెంకటరావు అన్నారు. టీడీపీ భవిష్యత్తు గ్యారంటీ చైతన్య యాత్రలో భాగంగా నర్సీపట్నంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ప్రభుత్వంలో ప్రశ్నించే వారిపై కేసులు పెట్టి గొంతు నొక్కుతున్నారన్నారు. ఇప్పటి నుంచే పార్టీ విజయానికి శ్రమించాలని, ఏమాత్రం తేడా వచ్చినా పులి పంజాకు తట్టుకోలేమన్నారు. మాజీ మంత్రులు అయ్యన్నపాత్రుడు ఉపన్యాసంలో ఎప్పుడు చెప్పే విషయాలే తప్ప కొత్తదనం లేదు. మాజీ స్పీకర్ ప్రతిభా భారతి, బండారు సత్యనారాయణమూర్తి ఊకదంపుడు ఉన్యాసం చేశారు. టీడీపీ నేతలు బస్సు యాత్ర పేరుతో నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. సభ నిండుగా కనిపించేందుకు ప్రైవేట్ స్థలంలో మీటింగ్ ఏర్పాటు చేశారు. జనాలను నింపేందుకు టీడీపీ నేతలు నానాతంటాలు పడ్డారు. సమయానికి గ్యాలరీ నిండకపోవడంతో మీటింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. వచ్చిన జనాలు సైతం సభ జరుగుతుండగానే జారుకున్నారు. అంతకు ముందు మాకవరపాలెం మండలంలోని శెట్టిపాలెం, రాచపల్లి జంక్షన్ వద్ద బస్సు యాత్రజరిగింది.

క్లుప్తంగా

వామనావతారంలో జగన్నాథుడు



వామనావతారంలో దర్శనమిచ్చిన స్వామి

కశింకోట: కశింకోటలోని దేవదాయ శాఖకు చెందిన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో జగన్నాథస్వామి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. భక్తులు నిత్యం పెద్ద సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకుని పూజలు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఐదవ రోజు విష్ణుమూర్తి దశావతారాల్లో ఐదవ అవతారమైన వామనునిగా జగన్నాథస్వామిని అలంకరించారు. సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలు, భక్తుల గోత్ర నామార్చనలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు రేజేటి శ్రీరామాచార్యులు, అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, రేజేటి మారుతి, రేజేటి రామచరణాచార్యులు తదితరులు పూజా కార్యక్రమాలు జరిపారు. ప్రసాద వితరణ చేశారు.

ప్రయోగ పరికరాలకు టెండర్లు

అనకాపల్లిటౌన్ : జిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 48 రకాల ప్రయోగశాల పరికరాలు, రాపిడ్ పరీక్షలు, ఇతర పరికరాలు సరఫరా చేసేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో ఎ.హేమంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను జూలై 1వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కార్యాలయం పని దినాల్లో అందజేయాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు Anakapalli. ap. gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 9849112546 నంబరులో సంప్రదించాలని కోరారు.

రేబాకలో నేడు గడప గడపకు మన ప్రభుత్వం

అనకాపల్లిటౌన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మండలంలో రేబాక గ్రామంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ గొర్లి సూరిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరవుతారని ఆయన తెలిపారు. గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

అనకాపల్లి సినిమాలు

మనుచరిత్ర	: రాజా
టక్కర్	: సత్యనారాయణ స్క్రీన్-1
మేమ్ ఫేమస్	: సత్యనారాయణ స్క్రీన్-2
1920	: షిర్డిసాయి
అశ్వనీస్	: పర్తిసాయి
భీమదేవరపల్లి బ్రాంచ్ (3 ఆటలు)	
ది ఫ్లాష్ (మ్యాట్నీ)	: వెంకటేశ్వర
యూనివర్సిటీ	: శ్రీసత్య
ఆదిపురుష్	: రామచంద్ర

బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 79 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,700	4,700
రెండో రకం	4,100	4,100
మూడోరకం	3,930	3,930

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 47 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. 'ఎ' పాజిటివ్-8 యూనిట్లు, 'ఎ' నెగెటివ్-2 యూనిట్లు, 'బి'పాజిటివ్-12 యూనిట్లు, 'బి' నెగెటివ్-2 యూనిట్లు, 'ఒ' పాజిటివ్-14 యూనిట్లు, 'ఒ' నెగెటివ్ 4 యూనిట్లు , 'ఎబి' పాజిటివ్ 5 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య (9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 392 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 368 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 9441108144)ని సంప్రదించవచ్చు.

ఆరోగ్యాంధ్రప్రదేశే లక్ష్యంగా..

- ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం
- ఇంటి వద్దే వైద్యసేవలు.. మందుల పంపిణీ
- ముఖ్యమంత్రి ఔదార్యానికి కృతజ్ఞతలు చెబుతున్న ప్రజలు
- గ్రామాల్లో విస్తృతంగా ఫ్యామిలీ డాక్టర్ విధానం
- ప్రతి రోజు గ్రామాల్లో క్షేత్రస్థాయి వైద్యసేవలు

పట్టణాల సంగతేమో కానీ.. పల్లెల్లో మెరుగైన వైద్యం చేయించుకోవాలంటే గగనమే. ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో ఉండే ఆసుపత్రులకు శ్రమపడి వెళ్లాలి. అక్కడ కూడా సరైన వైద్యం అందుతుందో లేదో చెప్పలేని పరిస్థితులు. కానీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అలాంటి పరిస్థితు లను పూర్తిగా మార్చేసి రోగి గుమ్మం వద్దకు వెళ్లి వైద్యం అందించాలనే సరికొత్త ఆలోచనతో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమానికి రూపకల్పన చేశారు. తమకు సీఎం అందజేసిన ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉందని మారుమూల పల్లెల ప్రజలు వేనోళ్ల సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కొనియాడుతున్నారు.

తుమ్మపాల: ప్రతి పేదవాడు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ పథకం ద్వారా మారుమూల పల్లెల్లో సైతం చక్కటి వైద్యం అందేలా చర్యలు తీసుకున్నారు. దీంతో వారంలో ఒక్కో రోజు ఒక్కో గ్రామంలో వైద్యులు నేరుగా రోగుల వద్దకే వెళ్ళి సేవలందిస్తున్నారు.

మండలంలో మూడు పీహెచ్‌సీలు..

అనకాపల్లి మండలంలో 32 గ్రామ పంచాయతీలుండగా మూడు (తుమ్మపాల, తగరంపూడి, కశింకోట) పీహెచ్‌సీల ద్వారా వైద్యసేవలు అందిస్తున్నారు. పీహెచ్‌సీల్లో కనీసం ఇద్దరు, 104 వాహనంలో మరొకరు నిత్యం సేవలు అందిస్తున్నారు. వైద్యులు షెడ్యూల్ ప్రకారం గ్రామాల్లో తిరిగి ఫ్యామిలీ డాక్టర్ పథకం ద్వారా సేవలందిస్తున్నారు. తుమ్మపాల పీహెచ్‌సీ ద్వారా తుమ్మపాల, గుండాలజంక్షన్, మామిడిపాలెం, మాకవరం, మార్టూరు, పాపయ్యపాలెం, పీఎస్ పాలెం, కొండుపాలెం, రేబాక, శంకరం, సీహెచ్ఎన్ అగ్రహారం, గొలగాం, బట్లపూడి, మారేడుపూడి, అక్కిరెడ్డిపాలెం ప్రాంతాల్లోను.. తగరంపూడి పీహెచ్‌సీ పరిధిలో తగరంపూడి, సీతానగరం, వెంకుపాలెం, ఊడేరు, దిబ్బపాలెం, బవులవాడ, సుందరయ్యపేట, కుంచంగి, జగన్నాథపురంలోను.. కశింకోట పీహెచ్‌సీ పరిధిలో కొత్తూరు, సత్యనారాయణపురం, పిసినికాడ, వేటజంగాలపాలెం, సంపతిపురం వంటి గ్రామాల్లో సేవలు అందుతున్నాయి.

ఫ్యామిలీ డాక్టర్ పథకంలో ఈ సేవలు..

ఈ పథకంలో ముఖ్యంగా హెచ్‌బీ, బ్లడ్‌గ్రూప్, హెచ్ఐవీ, హెచ్‌బీఎస్, వీడీఆర్ఎల్, ఆర్‌బీఎస్, గర్భనిర్ధారణ, యూరిన్, షుగర్ వంటి టెస్టులతో కలిపి మొత్తం 46 రకాల పరీక్షలు చేస్తున్నారు. వ్యాధిని బట్టి మందులు అందిస్తున్నారు.



బట్లపూడిలో ఫ్యామిలీ డాక్టర్ పథకంలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

ఫ్యామిలీ డాక్టర్ పథకం.. వరం..

మారుమూల పల్లెల్లో సైతం ఫ్యామిలీ డాక్టర్ పథకంలో వైద్యులు నేరుగా ఇంటి వద్దకే వస్తున్నారు. వైద్యం చేయించుకోలేక మంచాన ఉన్న నిరుపేద రోగులకు ఈ పథకం వరంలా మారింది. వారి ఇంటి వద్దకే వైద్యులు వచ్చి పరీక్షలు చేస్తున్నారు. అవసరమైన మందులు అందిస్తున్నారు. నిత్యం వైద్య సిబ్బంది పర్యవేక్షణ చేస్తున్నారు. గతంలో వైద్య సేవల కోసం మండల కేంద్రాలకు వెళ్లే పరిస్థితులు ఇప్పుడు లేవు. వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– భాదపు హరికృష్ణ, సుందరయ్యపేట.

రోజుకో గ్రామంలో వైద్యసేవలు..



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ప్రతిరోజు ఒక గ్రామానికి వెళ్లి సేవలందిస్తున్నాం. ముఖ్యంగా తీవ్ర అనారోగ్యంతో మంచాన పడ్డ రోగుల ఇంటి వద్దకే వెళ్లి పరీక్షలు చేసి అవసరమైన మందులిస్తున్నాం. అసంక్రమిత వ్యాధులకు పరీక్షలు, చికిత్స, రక్తహీనత పరీక్షలు, ప్రసూతి ఆరోగ్య సంరక్షణ సేవలు, బాలింతల ఆరోగ్య సంరక్షణ వంటి అన్ని సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ వాణి, మెడికల్ ఆఫీసర్, తుమ్మపాల పీహెచ్‌సీ

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్‌కు 3 నుంచి పరీక్షలు

అనకాపల్లిటౌన్: డ్రాయింగ్, హ్యాండ్లూమ్, వీవింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్థానిక గవరపాలెం జీవీఎంసీ (బాలుర) హైస్కూల్లో వచ్చే నెల 3 నుంచి 6వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు www.bse.ap.gov.inలో హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పాస్‌పోర్ట్, పాన్‌కార్డు, ఓటర్ ఐడీ, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సుల్లో ఏదో ఒకటి పరీక్షా కేంద్రానికి తీసుకు రావాలని ఆమె తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



పనులకు శంకుస్థాపన చేస్తున్న హరిబాబు

మాకవరపాలెం: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని తూర్పుకాపు సంఘం మండలాధ్యక్షుడు గొంతిన హరిబాబు అన్నారు. ఇటీవల మండలంలోని కింది తామరంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తాగునీటి పథకం మంజూరుకు స్థానికులు ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో నిధులు మంజూరు చేయడంతో తాగునీటి పథకం ట్యాంకు నిర్మాణానికి శనివారం హరిబాబు, వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి శంకుస్థాపన చేశారు.

'జగనన్న సురక్ష'లో 11 రకాల సర్టిఫికెట్ల అందజేత



కోడూరులో లబ్ధిదారుని రేషన్‌కార్డును పరిశీలిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ



విజయరామరాజుపేట సచివాలయంలో అధికారుల సమీక్ష సమావేశం

అనకాపల్లిటౌన్ : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఇంటింటా నిర్వహించనున్నట్లు ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ తెలిపారు. మండలంలో కోడూరు, తుమ్మపాల పంచాయతీల్లో జగనన్న సురక్షపై ఆయా ప్రాంతాల ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 11 రకాలైన సర్టిఫికెట్లు ఉచితంగా అందజేస్తారన్నారు. ప్రభుత్వం అందజేసిన యాప్ ద్వారా సమస్యలు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధరరావు, ఎంపీడీవో నరసింహారావు, వివిధ శాఖల అధికారుల, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

విజయరామరాజుపేటలో..

తుమ్మపాల: జగనన్న సురక్ష పథకంలో అన్ని సమస్యలకు పరిష్కారం లభించనుందని పట్టణ సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ 83వ వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్, ఎంఎల్‌వో ప్రేమ్‌కుమార్ తెలిపారు. పట్టణంలో విజయరామరాజుపేట సచివాలయంలో శనివారం జరిగిన సచివాలయ అధికారులు, వలంటీర్ల సమావేశంలో వారు మాట్లాడారు. జూన్ 1 నుంచి ప్రతిష్టాత్మకంగా ప్రారంభం కానున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో ఉచితంగా ప్రజలందరికి 11 రకాల సేవలు అందుతాయన్నారు. మాజీ కౌన్సిలర్ పతకా సత్యనారాయణ, నడిశెట్టి మధు, ఎన్టీఆర్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు మూనురు శ్రీను పాల్గొన్నారు.

జనాన్ని దోచుకునేందుకు బాబు మరో ప్రయత్నం

- బాబు మాటలు నమ్మొద్దు
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్



అవ్వతో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



సంక్షేమ పథకాల పుస్తకాన్ని లబ్ధిదారుకు అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్ : చంద్రబాబు ప్రజాధనాన్ని దోచుకున్నారే తప్ప ప్రజాసంక్షేమంపై దృష్టి సారించలేదని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్యశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలో మారేడుపూడి గ్రామంలో శనివారం రాత్రి ఎంపీపీ గొర్లి సూరిబాబు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమం, ప్రజాసమస్యలపై ఆరా తీసి ప్రజలకు లబ్ధి పత్రాలను అందజేశారు. గ్రామంలో పూసలకాలనీలో పర్యటిస్తున్న సమయంలో మహిళలు మంత్రిని కలిసి చర్చి కావాలని, సిక్కు సంఘాల నాయకులు కలిసి తమకు గురుద్వార్, ఇళ్లపట్టాలు కావాలని మంత్రి అమర్‌నాథ్‌కు విన్నవించారు. అక్కడే ఉన్న అధికారులను పిలిచి దీనికి సంబంధించిన వివరాలు సేకరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని దోచుకునేందుకు చంద్రబాబు మరో ప్రయత్నం చేస్తున్నారని, ఆయన మాటలు నమ్మొద్దని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. ప్రజాసంక్షేమం కోసం నవరత్నాలు ఎందుకు అమలు చేయలేదో రాష్ట్ర ప్రజలు ప్రశ్నించే సమయం ఆసన్నమైందన్నారు. ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో మళ్లీ జనం ముందుకు వచ్చి మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలోనే బాబుకు ప్రజలు గుర్తొస్తారా అని మంత్రి అమర్‌నాథ్ ప్రశ్నించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధిపై సమదృష్టితో పని చేస్తున్న సీఎం జగన్ పాలనలో దేశంలోని మిగిలిన ముఖ్యమంత్రులకు ఆదర్శంగా నిలిచారన్నారు. రాష్ట్ర ప్రజలు ప్రతిపక్షాలను మరిచిపోయే రోజులొచ్చాయని పేర్కొన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో అర్హులైన వారందరికీ ప్రభుత్వ ఫలాలు అందించామని, మిగిలిన వారికి జగనన్న సురక్ష కార్యక్రమంలో పథకాలు అందజేస్తామన్నారు. సంక్షేమ పథకాలు పొందేందుకు ఆయా సచివాయాల్లో సంబంధిత పత్రాలు సక్రమంగా ఉన్నాయో? లేదో? చూసుకోవాలని మంత్రి అమర్‌నాథ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాలాపు కనకరాజు, ఎంపీటీసీ ఈగల రామునాయుడు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని పండగ చేసిన సీఎం జగన్‌కు అండగా ఉందాం



రైతుకు విత్తనాలు అందిస్తున్న దాడి రత్నాకర్. చిత్రంలో కార్పొరేటర్లు కొణతాల నీలిమ, పీలా లక్ష్మీసౌజన్య

- వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్: వ్యవసాయాన్ని పండగలా మార్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. పట్టణంలో గవరపాలెం భీశెట్టి అప్పారావు కల్యాణ మండపంలో శనివారం ఆయన రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యవసాయం దండగ అన్న గత ప్రభుత్వానికి పండగ అని నిరూపించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డేనని చెప్పారు. తొలకరి వర్షాలకు వరి పంట వేసుకునేందుకు వీలుగా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం అభినందనీయమన్నారు. నియోజకవర్గంలో ఉన్న రైతుభరోసా కేంద్రాల్లో రైతులు పాస్ పుస్తకాలు ఆధార్ కార్డుకు అనుసంధానం చేసి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు అధిక దిగుబడులు సాధించేలా ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలతో అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు. తద్వారా రైతులు సలహాలు, సూచనలు పొందవచ్చని తెలిపారు. రైతులకు ప్రభుత్వం అండగా ఉండేందుకు రైతుభరోసా కేంద్రాలు, రైతుభరోసా పథకం కింద నగదు జమ చేసిందన్నారు. ఈ ప్రాంతంలో రైతులకు ఏ విధమైన సమస్యలు ఏర్పడినా తాము అండగా నిలుస్తామన్నారు. ప్రభుత్వ అధికారుల ద్వారా కాలువల్లో పూడికలు తీయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. రైతులు వరిపంట మాత్రమే కాకుండా ఇతర ఆదాయ మార్గాల కోసం మిగిలిన అపరాల పంటలను పండించాలని సూచించారు. చిరుధాన్యాల పంటలు సాగు చేసి లాభాలు ఆర్జించాలన్నారు. ఈ కార్యక్రమంలో 80, 81 వార్డుల కార్పొరేటర్లు కొణతాల నీలిమ, భాస్కర్, పీలా లక్ష్మీసౌజన్య, రాంబాబు, గౌరీ పీఏసీఎస్ చైర్మన్ కాండ్రేగుల కృష్ణ అప్పారావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ శిలపరశెట్టి బాబీ, వైఎస్సార్‌సీపీ నేతలు కాండ్రేగుల విశ్వేశ్వరరావు, కొణతాల ఆది నాగేశ్వరరావు, పీలా అప్పారావు, కర్రి మోదునాయుడు, పొలిమేర శివ అప్పారావు, సన్యాసిరావు, పెట్ల నాగేశ్వరరావు, కోటపల్లి శ్రీను, కొణతాల పరదేశినాయుడు, రేబాక ఇంద్రకుమార్, నందవరపు కుమార్, ఆడారి రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. అనకాపల్లి నుంచి నర్సీపట్నం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, ఎదురుగా వస్తున్న స్కూటీ ఢీకొన్నాయి. దీంతో స్కూటీ నడుపుతున్న ఒకరు తీవ్రంగాను, మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. వీరి వివరాలు తెలియాల్సి ఉంది. వీరిని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు.

గోవాడలో ఉపాధి పనులు ప్రారంభం



ఉపాధి పనులను ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు

చోడవరం: గోవాడలో ఎట్టకేలకు ఉపాధి హామీ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఇక్కడ కొంత మందికి జాబ్ కార్డులు ఉన్నప్పటికీ వారు పనిలోకి రాకపోవడంతో కొన్నేళ్లుగా ఉపాధి పనులు నిర్వహించలేదు. దీంతో ఇటీవల మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు చొరవ తీసుకొని కొత్తగా కొత్తమందికి జాబ్ కార్డులు మంజూరు చేయించారు. అంతేకాకుండా రూ. 10 లక్షలతో ఉపాధి పనులు చేసేందుకు శ్రీకారం చుట్టారు. దీనితో పనులు ప్రారంభం కావడంతో మొదటి రోజు 370 మంది కూలీలు ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామంలో ఉపాధి పనులు చేపట్టడంతో ఇప్పటి వరకూ కూలీ పనుల కోసం ఎదురుచూస్తున్న వారంతా హర్షం వ్యక్తం చేశారు.

దివ్యాంగ విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రావికమతం: ఈ నెల 21న ఆంధ్రా యూనివర్సిటీ సిల్వర్ జూబ్లీ గ్రౌండ్స్‌లో 500 మంది విద్యార్థులు యోగాసనాలు వేయడం ద్వారా ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నెలకొల్పారు. వీరితో పాటు పాల్గొన్న మేడివాడ హైస్కూలుకు చెందిన దివ్యాంగ విద్యార్థులు కొట్యాడ రాము, వియ్యపు హరీష్, పులకండం శ్యామ్‌కుమార్‌లను హెచ్ఎం వంకాయల రామారావు, ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మినాయుడు, ఎంపీటీసీ సత్యప్రసాద్, ఉప సర్పంచ్ వజ్రపు శివ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ శేషుబాబు శనివారం ఘనంగా సన్మానించి అభినందించారు. ఏపీ సమగ్ర శిక్ష, రోటరీ క్లబ్, ఆంధ్రా యూనివర్సిటీ యోగా డిపార్టుమెంట్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఏయూలో ఉదయం 6 నుంచి 7 గంటల వరకూ వివిధ రకాల యోగాసనాలు వేశారు.

జగనన్న లేఅవుట్లకు ప్రత్యామ్నాయ స్థలం చూపాలి



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కలగా లక్ష్మి



హాజరైన సభ్యులు, అధికారులు

కశింకోట: మండలంలో నాలుగు చోట్ల కేటాయించిన భూముల్లో వేసిన జగనన్న లే-అవుట్లు దూరం కావడం వల్ల లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముందుకు రాలేదని, దీనిదృష్ట్యా ఆయా ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ స్థలాలను సత్వరమే ఎంపిక చేసి లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించి గృహ నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ సర్వసభ్య సమావేశం డిమాండ్ చేసింది. కశింకోటలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ కలగా లక్ష్మి అధ్యక్షతన శనివారం ఈ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జి.భీమవరం సర్పంచ్ హనుమంతు వెంకట్, ఎంపీటీసీ సభ్యుడు శంకరరావు మాట్లాడుతూ జి.భీమవరం శివారు సింగవరం, అడ్డాం గ్రామాల్లో జగనన్న గృహ నిర్మాణ లే-అవుట్లు గ్రామాలకు దూరంగా ఉన్న ప్రాంతాల్లో అధికారులు కనీసం స్థానిక ప్రజా ప్రతినిధులు, పెద్దలను సంప్రదించకుండా రైతుల నుంచి డి ఫారం పట్టా భూములు కొనుగోలు చేసి కేటాయించారన్నారు. దూరం కావడం వల్ల లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవడానికి ముందుకు రాకపోవడం వల్ల అవి ఖాళీగా ఉన్నాయన్నారు. వారికి తాము సమాధానం చెప్పలేక పోతున్నామని అన్నారు. ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించుకునేలా సత్వర చర్యలు తీసుకోవాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు మాట్లాడుతూ చింతలపాలెం, ఏనుగుతుని గ్రామాల్లో కూడా ఇదే సమస్య ఉందని, వీటిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య సత్వరమే పరిష్కరించాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ జి. సత్యనారాయణ తాను నూతనంగా బాధ్యతలు చేపట్టానని, ఈ సమస్య తన దృష్టికి తాజాగా వచ్చిందన్నారు. దీనిపై సమగ్రంగా పరిశీలన జరిపి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతానన్నారు.

వారంలోనే గృహ లబ్ధిదారులకు చెల్లింపులు: గృహ నిర్మాణ శాఖ ఎఈ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు వారం రోజుల్లో చెల్లింపులు జరుపుతామని తెలిపారు. ఇంకా ప్రారంభించని గృహాలను ఈ నెలఖరులోగా ప్రారంభించడానికి స్థానిక ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో లబ్ధిదారులను ప్రోత్సహించాలన్నారు. ఇళ్లు నిర్మించుకోని లబ్ధిదారుల ప్లాట్లు రద్దు చేసి కొత్త వారికి కేటాయిస్తామని హెచ్చరించారు. వైస్ ఎంపీపీలు పెంటకోట జ్యోతి, నమ్మి మీనా, ఎంపీటీసీ సభ్యులు చెవ్వేటి చెల్లయమ్మ, యల్లపు వరలక్ష్మి, నడిపల్లి గంగాభవాని, నిమ్మదల లక్ష్మి, ఎంపీడీవో వి.వి. రవికుమార్, పంచాయతీరాజ్ డీఈలు సత్యనారాయణ, వేణుగోపాలరావు, ఎంఈవో చిట్టిబాబు, సర్పంచ్‌లు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నకృష్ణ

అనకాపల్లిటౌన్: అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం తీసుకుని త్వరితగతిన గృహా లు నిర్మించుకోవాలని ఆర్డీవో ఏజే చిన్నికృష్ణ అన్నారు. అక్కిరెడ్డిపాలెం గ్రామంలో జగనన్న గృహాలను శనివారం ఆయన పరిశీలించి లబ్ధిదారుల సమస్యలు తెలుసుకున్నారు. గ్రామాల్లో 60 శాతం జగనన్న గృహాల నిర్మాణం జరిగిందని, మిగిలిన వారు త్వరితగతిన పూర్తి చేసుకునేందుకు సచివా లయ సిబ్బంది, హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దా ర్ గంగాధరరావు, ఎంపీడీవో నరసింహారావు, ఈవోఆర్డీ ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.